కథా నిలయం
4677
శ్రీకాకుళం

# మరకతం మాయ

సుబ్బాయమ్మ చిన్నకూతురు మరకతం ప్రొద్దున రైల్లోదిగింది ఇద్దరు పిల్లలను తీసుకుని.

తండ్రి సాంబయ్య వీధివరండాలో కూర్చుని పత్రిక చదువుతున్నాడు. గేటు దగ్గర సందడివిని "మరకతం, అల్లుడుకూడా వచ్చాడా ?" అడిగాడు.

"లేదు నాన్నా, నేనే పిల్లలను తీసుకువచ్చాను'' అన్నది కాస్త జంకుతూ.

"లోపలికి వెళ్ళు, అమ్మ లేచింది" అన్నాడు.

మరకతం లోపలికి వెళ్ళింది. తల్లికి కనబడి పిల్లలకు పాలు గ్లాసులతో అందించి తను కాఫీగ్లాసుతో తల్లిదగ్గరే కూర్చుంది.

"మీ ఆయనకు కాలినొప్పి తగ్గిందా ? నీవు ఉత్తరాలు రాయటమే మానేశావు."

"ఏమిటో ఈ పిల్లలతో పని తెమలటం లేదమ్మా" అంటూ ఈ కబురూ ఆ కబురూ చెప్పి అసలుసంగతి బయటపెట్టింది.

"పిల్లలను ఇక్కడ ఉంచుతావా ? ఏమిటి సంగతి ? ఒంట్లో బాగాలేదా ? అల్లుడు ఉద్యోగం చేస్తున్నాడా ? సెలవుమీద ఉన్నాడా ?" తల్లి ఆవేదన.

''లేదమ్మా, ఉద్యోగంలో చేరి నెలయింది."

"ఎవరయినా వచ్చి ఈ పిల్లలెవరని అడిగితే నేనేమని చెప్పను ? తల్లీ తండ్రీ లక్షణంగా ఉండి మాదగ్గర ఉంచటమెందుకు పిల్లలను ? మేమేమయినా చిన్నపిల్లల మనుకుంటున్నావా ? ఏదో ఒక సమస్య తెచ్చిపెడతావే నీవు ?"

"అబ్బ, ప్రతిదానికీ సమస్య సమస్య అంటావేమిటి? అవసరమొస్తే తల్లి

దగ్గర కాక ఎవరిదగ్గర ఉంచుతారు పిల్లలను ? ఎంతమంది అమ్మమ్మల దగ్గర పిల్లలు ఉండటం లేదు ?" మరకతానికి కోపం వస్తోంది తల్లిమాటలకు.

"చూడు మరకతం, మీ అత్తగారి దగ్గరుంచు. ఇంట్లో నలుగురు పిల్లలున్నారు. పిల్లలతో కలిసి ఆడుకుంటారు చదువుకుంటారు. ఇక్కడ మేమిద్దరమే."

"అత్తగారి దగ్గర ఉంచమని నీ సలహాఏమిటి ? వీలుగా ఉంటే నేనే ఉంచేదాన్ని. గ్రహించుకోవేం? అక్కడ వీలుంటే ఇక్కడికి వస్తానా ?''

"ఏమోనమ్మా, మీ నాన్ననడుగు. ఏదో నాపిల్లలను పెంచాను ఎలాగో. కాస్త ఇప్పుడే తెరిపిగా ఉన్నామనుకుంటుంటే నీ పిల్లలను దగ్గరుంచుకోమంటున్నావు" అన్నది సుబ్బాయమ్మ.

"నాన్నకంటె ముందు నీకే చెప్పాలనిపించి అడిగాను. నీవేమో ముందే ఎగరగొట్టేస్తున్నావు నా మాటలను. నేనెంత కష్టంలోఉండి అడిగానో తెలిస్తే నీవిట్లా అనవు. అయినా నీవు పిల్లలను ఇక్కడ ఉంచుకుంటానంటే నాన్న వద్దంటాడా ? నాన్నకు సర్ది చెప్పాల్సిందిపోయి, నీవే వద్దంటున్నావాయె."

"అదికాదే, ఇది లోకం. నలుగురూ నాలుగు మాటలంటారు. ముఖమ్మీదనే ప్రశ్నలు వేస్తారు. పైగా 'తల్లీ తండ్రీ బాగున్నారా ?' అనికూడా అడుగుతారు."

"అబ్బబ్బ ! అయినా నీవు ఈ కాస్తకే భయపడే మనిషివేనా ? వాళ్ళ మాటలను అసలు నీవు లెక్కపెట్టే దానివేనా ? ఒక మాటకు పది దులుపుతావు. నీకే ఇష్టముంటే ''వీళ్ళు నాకొడుకు పిల్లలు. వాడికి ఇంకోచోటికి బదిలీ అయింది. అక్కడ మన తెలుగుభాష లేదు. అందుకని ఇక్కడికి పంపించాడు. ఇలా ఊళ్ళు తిప్పుతూ ఉంటే పిల్లల చదువు పాడయిపోతుందని" నీవే సమర్థించి జవాబు చెప్పగలవు."

"ఈ వాడలో పదేళ్ళనుంచీ ఉంటున్నాము. ఈ పిల్లలెవరయినదీ అందరికీ తెలుసు. ఎవరు వచ్చిపోతూ ఉంటారోకూడా తెలుసు. మేమెటువంటి వాళ్ళమో తెలుసు. ఇప్పుడు నీ పిల్లలకోసం అబద్ధాలు చెప్పమంటావా ?"

"నీవు ఎన్నయినా చెప్పు. ఈ పిల్లలిద్దరినీ నీదగ్గరే ఉంచుతాను. వాళ్ళకయ్యే ఖర్చుకూడా ఇస్తాను. స్కూల్లోచేర్చి ఫీజుకట్టి పుస్తకాలుకూడా కొనిస్తాను. బట్టలు కుట్టిస్తాను. ఇంక ఎదురు చెప్పకు.''

ఇది రెండోసారి మరకతం పిల్లలను తీసుకువచ్చి తల్లిదగ్గర ఉంచుతానని అడగటం. కాదంటే గొడవచేయటం ఏడవటం. సుబ్బాయమ్మ మనిషి దృఢంగానే ఉంది కాని, ఎవరిపిల్లలను వాళ్ళదగ్గరే ఉంచుకుని వాళ్ళకిష్టంవచ్చిన రీతిలో పెంచుకోవాలనే పద్ధతిగల మనిషి.

ఆ మాట మనసులో ఉంచుకునే "పిల్లలను పెట్టుకోగానే సరికాదు. వాళ్ళకు వేళకు స్నానాలు చేయించి, భోజనాలు పెట్టి, టిఫిన్ డబ్బాలిచ్చి, స్కూలుకు పంపించాలి. సరిగా చదువుతున్నారో లేదోనని కనుక్కుంటూ ఉండాలి. అన్నిటి కంటె ఆ యూనిఫారమ్‌లు ఉతికించి ఇస్త్రీచేసి పెట్టాలి. పిల్లలను ఉంచుకోవటం నావల్ల కాదమ్మా" అన్నది.

మరకతం తల్లిమాటలు వినిపించుకోకుండానే వాళ్ళను వదిలిపెట్టి తిరుగు రైల్లో వెళ్ళిపోయింది.

"చూశారా దాని అఘాయిత్యం? నాకు చేతకాదన్నా, వీలులేదన్నా, వినిపించుకోకుండా వెళ్ళిపోయింది పిల్లలను వదిలిపెట్టి. మీరు దేనికీ మాట్లాడరు. ఇంతభారం నేను వహించగలనా? ఆ పిల్లలు ఆటగోటి తనంలో ఎక్కడ తిరుగుతారో ఏమిటో? నేను వెతికి ఇంటికి తీసుకురాగలనా? వాళ్ళను ఎప్పుడూ కళ్లల్లో పెట్టుకుని కాపాడగలనా? ఆ చదువులూ అవీ నాకు తెలుసునా వాళ్ళడిగితే చెప్పటానికి? పైగా నేను భయభక్తులతో పెంచుతానని ఇక్కడ ఉంచుతున్నానంటుంది. అయినా మీరు ఒక్కమాట, 'మా దగ్గర వీలుండదమ్మా' మేముఎక్కడైనా వెళ్ళవలసి వస్తే వీళ్ళ చదువు చెడిపోతుందని గనక అని ఉంటే, రోషం వచ్చి తీసుకువెళ్లేది. లేకపోతే ఏ బోర్డింగు స్కూల్లోనో చేర్చి వాళ్ళబాధ వాళ్ళు పడేవారు" అంది నిష్ఠూరంగా.

"వదిలిపెట్టి వెళ్ళింది కదా, సరే ఉండనీ. ఎప్పుడయినా వచ్చి చూస్తానందా?" సర్దుకుని అడిగాడు. ఆయనకూ ఇష్టం లేదు. కాకపోతే సుబ్బాయమ్మ మాదిరిగా ఖండితంగా మాట్లాడలేడు.

"తనుకూడా ఉద్యోగం చేస్తోందేమో?" అన్నాడు.

"చేస్తే మాత్రం వాళ్ళలో వాళ్ళే సర్దుకోవాలి. ఎంత మంది ఉద్యోగాలు చెయ్యటం లేదు? పిల్లలనూ సర్దుకుంటున్నారు. ఇళ్ళనూ సర్దుకుంటున్నారు. ఆ

బాధలన్నీ దీనికొక్క దానికే అన్నట్టు మీరుకూడా మాట్లాడటం ఏమన్నా బాగుందా?" మరకతమ్మీది కోపాన్ని భర్తమీదికి మళ్ళించింది.

ఆయన ఏమీ మాట్లాడలేదు.

పిల్లలలో శ్యాం పెద్దవాడు, పద్మ ఐదేళ్ళది. తల్లీ కూతుళ్ళమధ్య జరిగిన ఘర్షణ పూర్తిగా శ్యామ్ విన్నాడు. తల్లి ఇచ్చిన డబ్బు నాలుగు వందలూ జేబులో పెట్టుకున్నాడు. తాతగారి దగ్గరికెళ్ళి నిలబడ్డాడు, మాట్లాడే ధైర్యంలేక.

"ఏం కావాలిరా శ్యామ్?" అడిగాడు దగ్గరికిపిలిచి.

"తాతయ్యా, మమ్మల్ని స్కూల్లో చేర్పించు. నేను రెండోక్లాసు ప్యాసయ్యాను. సర్టిఫికెట్ తీసుకువచ్చాను. పద్దు యల్.కేజీ. అయింది. అమ్మ యూనిఫారముకి పుస్తకాలకూ స్కూల్లో చేరటానికీ డబ్బిచ్చింది. స్కూళ్ళు తెరిచారు తాతయ్యా" అడిగాడు భయపడుతూ.

"చేర్పిస్తానులే భయపడకు, మన యింటికి దగ్గర్లోనే ఒక స్కూలుంది. మీరిద్దరూ స్నానాలుచేసి సిద్దంగా ఉండండి. పద్దు ఏడవదు కదా బడికి వెళ్ళటానికి?"

''ఏడవదు తాతయ్యా, అయినా నేను ఉంటానుగా. ఇంటర్‌వల్లో కలుస్తాను. మా ఊళ్ళోనయినా నేను చూసేవాడిని" అన్నాడు, చేర్పిస్తే చాలన్నట్లు.

సుబ్బాయమ్మ నీళ్ళు బకెట్‌లో పోస్తే శ్యామ్ స్నానంచేశాడు. పెట్టెతెరిచి బట్టలు వేసుకుని తల దువ్వుకున్నాడు. పద్దు కూడా మాట్లాడకుండా అమ్మమ్మను రమ్మని పిలవకుండా స్నానంచేసి జడల్లేవు కనుక అన్నచేత తల దువ్వించుకుంది.

''అయితే వీళ్ళను తీసుకువెళ్ళి స్కూల్లో చేర్పిస్తారా ఏమిటి?" అంటూ హాల్లోకి వచ్చింది సుబ్బాయమ్మ.

"చేర్పిస్తాను. మధ్యలో వాళ్ళేంచేశారు? ఉన్నందుకు చదువుకుంటారు. పిల్లలు బుద్ధిమంతుల్లా కనబడుతున్నారు" ఆయన ఉత్తరీయం వేసుకుని చెప్పులు వేసుకున్నాడు.

"భోజనంచేసి బయలుదేరుతారా శ్యామ్?"

"లేదు తాతయ్యా వచ్చి చేస్తాములే"

"చిన్నపిల్ల ఉండగలదా అంత సేపు?"

"ఉంటుంది మాకలవాటే తాతయ్యా."

వాళ్ళనుచూస్తే జాలేసిందాయనకు. పిల్లలనుతీసుకుని బయలుదేరాడు. దగ్గరన్నమాటేగాని పద్దుచిన్నది కావటంచేత కాస్త వెనకబడుతూ మళ్ళీ పరుగెత్తి తాతగారిని కలుసుకునేది.

స్కూల్లో చేర్పించటానికి పెద్ద ఇబ్బందేంకలగలేదు. అది గవర్నమెంటు స్కూలు. డొనేషన్లుఅడగలేదు. కాని ఏదో పేరుమీద నూరు రూపాయలవంతున ఇద్దరికీకలిపి రెండువందలు తీసుకున్నారు.

కావలసినపుస్తకాలు అక్కడదొరికినంతవరకూ కొన్నాడు. యూనిఫారమ్‌లు పక్కకొట్లో దొరుకుతాయంటే తాతగారు తీసుకెళ్ళారు. కొసరి కొసరి బేరంచేస్తే ఒక యూనిఫారమ్‌వచ్చింది శ్యామ్‌దగ్గరున్నడబ్బులో. కొంచెం సేపాలోచించాడు సాంబయ్య. ఈ లోపల శ్యామ్‌కి పద్దూకి యూనిఫారమ్ ఎట్లాగని కళ్ళనీళ్ళొస్తున్నాయి. పద్దు బిక్కముఖం పెట్టింది.

"దానికీ కొంటానురా. అప్పుడే ఏడుపుముఖాలు పెట్టకండి" అంటూ ఇద్దరినీ దగ్గరికితీసుకుని వెన్నుతట్టి పద్దుకుకూడా ఒక యూనిఫారమ్ కొన్నాడు.

"అబ్బాయీ,ఇంకా రెండుపుస్తకాలు మీకు దొరకలేదు. రేపు మీరు స్కూలుకు వెళ్లేటప్పుడు నేనూవస్తాను. పాతపుస్తకాలు అమ్మేపిల్లలుంటారు. వాళ్ళదగ్గర తప్పకుండా దొరుకుతాయి. నేను కనుక్కుని కొంటాను. పెన్సిళ్ళూ రబ్బర్లూకొన్నారు కదా. ఇంక ఇంటికివెళ్దాం మీరు భోజనాలు చెయ్యలేదుపదండి" ఇంటికి తీసుకు వచ్చాడు.

పిల్లలకూ సాంబయ్యకూ భోజనాలు పెడుతూ ''అయితే స్కూల్లో చేర్చారన్నమాట!'' అన్నది సుబ్బాయమ్మ.

''అవును చేర్చాను ఊరికేఉంటే అల్లరిచేస్తారు'' అన్నాడు

పద్దుకు అన్నంసరిగా కలుపుకోవటం చేతకాదు. శ్యామ్ కలుపుతుంటేచూసి, "నేను కలుపుతాలే" అన్నది సుబ్బాయమ్మ.

ఓరగంటితోచూశాడు సాంబయ్య.

"నాన్న రోజూ ఆఫీసుకువెళ్తాడుట్రా శ్యామ్?" అడిగింది సుబ్బాయమ్మ.

"అదిగో ఆ సంగతులన్నీ వాళ్ళనడుగుతావేం? పిల్లలకేంతెలుసు? అయినా ఉద్యోగంచేసేవాడు ఆఫీసుకువెళ్ళక ఎక్కడికివెళ్తాడు?" అంటూ భార్యను మందలించాడు సాంబయ్య.

పిల్లలిద్దరూ చాపలేసుకుని పుస్తకాలు ముందరేసుకుని కూర్చుంటారు. చెల్లెలికి తెలియనిది శ్యాంచెబుతాడు. మరునాడు వేసుకోవలసిన బట్టలు తీసిపెడతాడు. యూనిఫారమ్‌లు ఇంటికిరాగానే గాలికి పెరట్లో తాటిమీద ఎండవేస్తారు. ఆదివారంనాడు చెల్లెలిదీ తనదీ యూనిఫారమ్‌లు సబ్బుపెట్టి నానబెడుతుంటే సుబ్బాయమ్మవచ్చి నేను ఉతుకుతాలే. బట్టలు నీవు ఉతకద్దు అక్కడ మీ బట్టలు నీవే ఉతుక్కునేవాడివా? మరి పద్దుబట్టలు ఎవరుఉతికేవారు?" అడిగింది సుబ్బాయమ్మ. పిల్లలు ఏమేమిపనులుచేసేవారో తెలుసుకోవాలని.

మా బట్టలు మేమే ఉతుక్కునేవాళ్ళం. అమ్మ వంటచేసిపెడితే మేమే పెట్టుకుతినేవాళ్ళం. అదే ఇంత మజ్జిగన్నం కలుపుకుని డబ్బాలో పెట్టుకుని తీసుకువెళ్ళేవాళ్ళం. ఇంటికివచ్చి మిగిలినఅన్నంతిని ఆడుకుని చదువుకునేవాళ్ళం. అమ్మ వేళకువస్తేసరి లేకపోతే ఆ మిగిలిందేమిటోతిని పడుకునేవాళ్ళం."

"అమ్మ ఎప్పుడువచ్చేది?"

"ఏమో మేము నిద్రపోయినప్పుడు ఎప్పుడువచ్చేవాళ్ళోమరి. తెల్లవారి మేము లేచేసరికి వంటచేసి పొయ్యిమీద పెట్టిఉంచేది. మేమే స్నానాలుచేసి బట్టలు పిండేసుకుని అన్నాలుతిని మళ్ళీ మూతపెట్టేవాళ్ళం"

సుబ్బాయమ్మ ఆశ్చర్యపోయింది. "మీకీ పనులు ఎవరునేర్పారు?"

"అమ్మేనేర్పింది. పద్దూకి ఏపనీసరిగారాదని నన్నుచూపించమనేది అమ్మ" అన్నాడు. ఆమె కోపంలేకుండా మాట్లాడుతున్నదన్న సంతోషంతో తనకు తెలిసినదంతా రోజూ ఆమె అడగగానే చెప్తూఉండేవాడు శ్యామ్.

"వాడిని ఏమీ అడగవద్దన్నానా? ఎందుకు వాళ్ళయింటి ఆరాలన్నీతీస్తావు? వాళ్ళు చిన్నపిల్లలని తెలిసుండీ అడగటం అవివేకం. ఇంక నీవు వాళ్ళయింటిని

గురించి అడిగితే నేను ఊరుకోను. జ్ఞాపకం పెట్టుకో" గట్టిగా మందలించేవాడు సాంబయ్య తను చూసినప్పుడల్లా.

మరకతం వెళ్ళి రెండునెలలయింది. పిల్లలెట్లాఉన్నారని ఒక్క ఉత్తర మయినా రాయలేదు. వాళ్ళకయిన ఖర్చు పంపిస్తానని చెప్పింది వెళ్ళేటప్పుడు అదీలేదు.

పిల్లలు రోజూ క్రమం తప్పకుండా స్కూలుకు వెళ్ళుతున్నారు. సాంబయ్య సుబ్బాయమ్మకు తెలియకుండా ఫీజులు కడుతున్నాడు.

ఒకనాడు శ్యామ్ నిక్కరుగుండీలుపోతే కొత్త గుండీలు కుడుతున్నాడు. అంతలోనే పద్దువచ్చి "అన్నయ్యా. నాగౌను నిన్న ఏదోతగిలి చినిగిపోయింది. నీ పని అయింతరువాత నాకిస్తావా సూదీదారం?" అడుగుతోంది.

"నీకు కుట్టటంరాదే. సూది చేతికిగుచ్చుకుంటావు. నేను కుట్టిస్తాలే అక్కడ పెట్టు" అన్నాడు.

బట్టలుకుట్టి శ్యామ్ పద్దూ ఆ చాపమీదనే దుప్పటిపరచుకుని పడుకున్నారు.

వాళ్ళమాటలు వింటున్న సాంబయ్య లేచివచ్చి ఎట్లాకుట్టాడో చూశాడు. వాళ్ళిద్దరికీ వాళ్ళపనులు వాళ్ళేచేసుకోవాలన్న పట్టుదలకు ఆయనకు చాలా ఆశ్చర్యంవేసింది. ఆ కుట్లు మరునాడే ఊడిపోవచ్చు-కాని పిల్లలకున్న ఊహలు?

ఏదయినాఅడిగితే సుబ్బాయమ్మ కోప్పడుతుందనో లేక పంపించేస్తుందనో భయంమాత్రం బాగా ఏర్పడిందని సాంబయ్య గమనించాడు.

ఆయన ప్రతిరోజూ రీడింగ్ రూమ్‌కివెళ్ళి వార్తా పత్రికల్లోని అన్ని పేజీలూ అన్ని కాలమ్‌లూ చదువుతాడు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేసేపార్టీలేవో ఆ జిల్లాలో ఇళ్ళు తగల బెట్టారనీ, ఇంకెక్కడో ఎవరినోచంపారనీ చదివినప్పుడు ఆయన గుండె ఝల్లు మంటుంది. కొందరు పోలీసులకు లొంగిపోయారనీ కొందరు పారిపోయారనీ చదివినప్పుడు ఆయన ముఖం ఒక మాదిరిగా పాలిపోయినట్టుగా ఉంటుంది.

సుబ్బాయమ్మ పిల్లలతో క్రమంగా అలవాటుపడ్డది. వాళ్ళనుచూస్తే అంతగా

ముఖం చిట్లించుకోవటంలేదు. పిల్లలురాగానే తింటారని ఏవైనా టిఫిన్లుకూడా చేస్తున్నది.

"నీ ముఖం రోజూ ఆ మజ్జిగన్నం తినటమేమిటి? ఇవాళ ఈకూర డబ్బాలో పెడతాను ఇద్దరికీ, కూరన్నంతిసి తరువాత మజ్జిగన్నం తినండి. అయినా ఈ డబ్బాలు సరిపోవటంలేదు. టిఫిన్ కారియర్లు చిన్నవి రెండు ఉండాలి - అటుకమీద తాతయ్యానుపిలు. తీస్తారు. తోమి వాటిలో ఇద్దరికీ పెరుగన్నంకూర కలిపిపెడతాను తినండి. రెండుసీసాలు కడిగిస్తాను. వాటిలోమంచినీళ్ళు పోసుకుని తీసుకెళ్ళండి. బాగా తినకపోతే బాగా చదవలేరు" అంటూ వాళ్ళకు అన్ని ఏర్పాట్లుచేయటం సాగించింది.

"ఎట్లాగయినా వాళ్ళతల్లిని కన్నతల్లి. అన్నీ తనపిల్లకు చేసినట్టే చేస్తుంది కాని-మనసులోఉన్నదేదో ముందూ వెనుకా చూడకుండా నోరు పారేసుకుంటుంది. అదీగాక అల్లుడిమీదకోపం. ఆకతాయిగా తిరుగుతాడనీ ఏఉద్యోగం సరిగా చెయ్యడనీను. ఆ కోపాన్ని కూతురిమీద, పిల్లలమీద, సాంబయ్యమీద చూపిస్తుంది.

కూతురు కాపరానికి వెళ్ళేనాడు తన నగలుకూడా పెట్టి, సాంబయ్య కొన్న చీరెలు కాక, తనవికూడా తీసి యిచ్చింది. తరువాత ఆరునెలలకు వచ్చిన మర కతం దగ్గర అవేవీ లేవు. ఏమయ్యాయని అడిగితే 'ఇంట్లో ఉంచి వచ్చాను' అనేది. కొన్నాళ్ళు.... తరువాత తరువాత ఆ మాట ఎత్తితే కస్సుమంటోంది. ఉద్యోగం సరిగా చెయ్యక అవన్నీ అమ్ముకున్నారని సుబ్బాయమ్మ ఊహించింది. కూతురి కాపరం ఇట్లా అయిందని బాధపడుతుంది. ఆ బాధే కోపంగా మారింది. అల్లుడి మాటఎత్తితే భద్రకాళి అయిపోతుంది.

శ్యామ్ పద్దు బాగా చదువుతున్నారు. ఈ స్కూల్లో చేరిన రెండవ సంవత్స రంలో అతడికి డబుల్ ప్రమోషన్ వచ్చింది. పద్దు మెల్లగా ఒక్కొక్క సంవత్స రమే ఈదుకొస్తున్నది. ఇప్పుడు రెండవ క్లాసులోకి వచ్చింది. శ్యామ్ ఐదవ క్లాసులోకి వచ్చాడు.

పిల్లలు ఎప్పుడైనా తల్లినీ తండ్రినీ తలుచుకుంటారు. "అన్నయ్యా, అమ్మ ఎప్పుడు వస్తుంది? నాన్నదగ్గరికి ఎప్పుడు తీసుకు వెళ్తుందిరా?" అని అడుగుతూ ఉంటుంది పద్దు.

"వస్తుందిలేవే, మనం చదువుకుంటూ ఉంటే అమ్మా వస్తుంది. నాన్నా వస్తాడు" పద్దు దిగులుపడుతుందేమోనని శ్యామ్‌కి భయం. తన మనసులో ఏముందో పైకి తెలియనివ్వడు.

రోజులు గడుస్తున్నకొద్దీ నెలలూ సంవత్సరాలూ అవుతాయి. అలా గడిచిన సంవత్సరాలలో శ్యామ్ పదోక్లాసు స్టేటుకు మొదటివాడిగా వచ్చాడు. పద్దు ఎనిమిదవ క్లాసుకు వచ్చింది.

సాంబయ్య ఆలోచిస్తున్నాడు. శ్యామ్‌ని కాలేజిలో చేర్పించాలా వద్దా అని.

"తాతయ్యా, స్టేటుకు ఫస్టువచ్చినందుకు స్కాలర్‌షిప్పు వచ్చింది. అదీ గాక పేదవాళ్ళ స్కాలర్‌షిప్పుకు నేను దరఖాస్తు పెట్టుకున్నానుకూడా. ఇంకా దీని సంగతి తెలియలేదు. కాని, అది వచ్చిందని తెలిసింది" అన్నాడు.

తనకు కాలేజిలో చేరటానికి డబ్బు వస్తుంది. కాని "తాతయ్య కాలేజిలో చేర్చకపోతే ? అప్పుడేం చెయ్యాలి ?" అన్న భయంకూడా ఉంది.

"తను స్వతంత్రించి అడుగుతాడా ? లేక, తాతయ్యతో చెప్పకుండానే కాలేజిలో చేరిపోతాడా ?"

"ఛీ, అలా చేరకూడదు. డబ్బు ఎవరిదయినా తాతయ్యే చేర్పించాలి. స్కాలర్‌షిప్పు వచ్చిందంటే ఆయనకూ సంతోషమేగా నేను కాలేజిలో చదువుతానంటే ఆయనకు కూడా సంబరమేగా."

ఆ సాయంత్రం తాతయ్య శ్యామ్‌ని పిలిచి "నేను ఇవాళ కాలేజిప్రిన్సిపల్‌ని కలిశాను, ఇంజనీరింగు చదివించండి. ఇంటర్ రెండేళ్ళయిపోతే ఇంజనీరింగు కాలేజిలో చేరిపోతాడు. మీరు కష్టపడక్కర్లేదు, అతడికి వచ్చిన స్కాలర్‌షిప్పు ముందు ముందు కూడా రావచ్చు" అన్నాడు. అందుకని నిన్ను ఇంజనీరింగ్‌కి పనికి వచ్చేటట్టుగా కాలేజిలో చేర్పిస్తాను రా. నీకిష్టమే కదూ ?" అన్నాడు.

"సరే తాతయ్యా, నీ యిష్టమే నా ఇష్టం చేర్పించు. కష్టపడి చదువుతాను. నా అదృష్టం ఎలాఉంటే అలా జరుగుతుంది. పద్దు పదోక్లాసు ఎట్లానెట్టుకొస్తుందో? అయినా ఇదివరకూ ఉన్నట్టు లేదు ఇప్పుడు, బాగా చదువుతోంది. మొన్న వాళ్ళ టీచర్ని అడిగాను, ప్రోగ్రెస్ బాగుంది. తాతయ్యా. మాకోసం మీరిద్దరూ ఎంత కష్టపడుతున్నారు! అమ్మమ్మ కూడా బాగా చూస్తోంది" అన్నాడు శ్యామ్.

"ఏమిట్రా ? ఏమో అనుకున్నాను, ఏవో పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నావు ? ఇన్నాళ్ళూ నీవు చిన్నపిల్లాడి వనుకున్నాను. బాగా మాటలు నేర్చావు. కష్టపడడం ఒక గొప్పసంగతా ? తాతలకూ బామ్మలకూ అమ్మమ్మలకూ వాళ్ళ పిల్లలకంటే మనమల మీద ఎక్కువ ప్రేమ ఉంటుందంటారు విన్లేదూ ? లేకపోతే ఎందుకు చేస్తారు చెప్పు ? నీ మనసులోకి ఇటువంటివన్నీ రానీయకు. తాతయ్యా అని పిలుస్తున్నావు, ఆ పిలుపుకేరా మేమేంచేసినా, సరే. ఇంక ఆ మాటలు వదలి పెట్టి ప్రస్తుతానికి రా. నీ సర్టిఫికెట్ల సంగతి చూసుకో" అన్నాడు బుజమ్మీద చెయ్యేసి.

తల ఊపుతూ పద్దూకి ఏదో చెప్పాలని వెళ్ళిపోయాడు శ్యామ్.

ఒంటరిగా సాంబయ్య కూర్చున్నప్పుడు సుబ్బాయమ్మ "ఏమిటండీ మరకతం ఒక్క ఉత్తరమైనా రాయదు ? మన సంగతి వదలిపెట్టండి. పిల్లలెట్లా ఉన్నారనైనా ఒక కార్డు రాయదు. ఏం మనుషులండి వాళ్ళు ? ఆ అల్లుడున్నాడే, అతడిదేనండీ ఈ దుర్మార్గమంతా, మన మరకతం మాత్రం అతడు చెప్పిందే వేద మంటుంది తెలివితక్కువ పిల్ల.

"తాతయ్యా !"

"ఏమ్మా, ఏమిటి చెప్పు.''

"అన్నయ్య ఇంజనీయరవుతాడట. మరి నేను ?"

"నీవా? కొంచెం సేపాలోచించాడు." ''అయితే నీవు కూడా అదే చదువుతావా ?"

"ఆఁ హాఁ, అది కాదు. నేను మెడిసన్ చదివితే ఎట్లా ఉంటుంది ?"

"బాగానే ఉంటుంది మరి నీవు చదవగలవా !"

"ఎందుకు చదవలేను ?''

"ఎందుకంటే ఆ కోర్సు బాగా కష్టపడి చదవాలి. ఇంకోసంగతి- అసహ్యమనుకోకూడదు, శవాలను చూసి భయపడకూడదు. ఆపరేషన్లు ధైర్యంతో చెయ్యాలి. శవాలను కోసి పరీక్షచెయ్యవలసి వస్తే మనసు గట్టిచేసుకొని చెయ్యాలి.

మరొకసంగతి, ఇంత కష్టపడి చదువుతావనుకో, అర్ధరాత్రి అపరాత్రి అనకుండా రోగులు పిలవంగానే నిద్రలోనుంచి లేపేరని వాళ్ళను కోప్పడకుండా వెళ్ళి నిదానంగా మాట్లాడి వైద్యంచేసి రావాలి. రోగి పక్కనున్నవాళ్ళు అనేకరకాల చెత్త ప్రశ్నలు వేస్తారనుకో, వాటన్నిటినీ వినిపించుకోకుండా నవ్వుతూ ఒక్క మాటతో బైటికి వచ్చేయాలి. ఇలా ఎన్నో విషయాలలో అప్రమత్తంగా ఉండాలి. నీవు వీటన్నిటినీ ఎదుర్కొనగలవా ?"

ఈ మాటలు విని పకపక నవ్వేసింది పద్మా.

"ఎందుకు నవ్వుతావు ? నేను చెప్పినదంతా నిజమమ్మా నిజం. నేను చెప్పనివి ఇంకా ఎన్నోఉన్నాయి. అవి కూడా చెప్తే భయపడి పారిపోయి ఇంటికి వస్తావు." ఆయనకూ నవ్వొచ్చింది పద్మతోపాటు.

"ఇవన్నీ మా టీచరు కూడా చెప్పింది. సరిగ్గా నీవుకూడా అవే మాటలు చెప్పావు. కాని నేనూ మా స్నేహితురాలూ పట్టుదలతో చదివి మీముందర నిలబడతామో లేదో చూడు. ఈమాటే మా టీచరుతో కూడా చెప్పాం.

"పద్మా, అమ్మమ్మను చూస్తేనే భయపడేదానివి ఆ శవాలను ఎట్లా ముట్టుకుంటావు ? భయపడి పారిపోయి రావుకదా ?"

"రాను. నేను ఇక్కడికి వచ్చినప్పటి పద్మాను కాదు. అన్నయ్యచేత తల దువ్వించుకునేటంతటి చిన్నపిల్లను కాను. అమ్మమ్మను చూసి భయపడే పిల్లననుకున్నావు నీవు. కాని, అది భయం కాదు. మా అమ్మ చెప్పింది అమ్మమ్మ దగ్గర అట్లాఉండి చదువుకొమ్మని."

"అయితే ధైర్యంగా చదువుతానంటావు ?"

"అవును చదువుతాను. మా అమ్మ చెప్పింది పెట్టె అడుగున ఒక గొలుసు పెట్టాను. అవసరమయితే దాన్ని అమ్మి అయినా మీకిష్టము వచ్చిన కోర్సు చదువుకొమ్మని. అదికాక మా టీచరు చెప్పింది గవర్నమెంటు లోన్ ఇస్తుందట. ఉద్యోగాలు చేసేటప్పుడు వాయిదాల పద్ధతిలో తీర్చుకోవచ్చునట."

"అబ్బ, ఎన్ని సంగతులు తెలుసుకున్నావమ్మా ! నీ మాటలు వింటేనిజంగా చదివేటట్లే ఉన్నావు, చేరిచూడు. అసలు అన్నిటికంటె ముఖ్యమైన పాయింటు

నీకు మార్కులు బాగా రావాలి. చదువులు చదివితే చాలదు. మంచి మార్కులతో పాసయి మెడల్ తెచ్చుకునేటట్టుగా ఉండాలి.

"తాతయ్యా, ఈ మాటకూడా మా టీచరు చెప్పిందే."

"సరేనమ్మా, నీవు బాగా ఎదిగిపోయావు. నాకే ధైర్యం చెబుతున్నావు. ముందు ఇంటర్లో బైపిసి తీసుకుని చదువు. మీ అన్నయ్యతో చెప్పావా?"

"చెప్పాను. నీలాగే నామాటలకు అదిరిపోయాడు తరువాత, "నీవు చదవ గలవులే, పట్టుదలతో చదువు" అన్నాడు.

పైకి ఎన్నిమాటలు చెప్తున్నా సాంబయ్యకు కడుపులో ఏదో దిగులు. అప్పు డప్పుడు వీధివాకిట్లో అరుగుమీద గోడకు తలఆనించి ఏదో ఆలోచిస్తూ ఉంటాడు. పిల్లలు కనబడినప్పుడు వాళ్ళతో ఏదో మాట్లాడుతూ ఉంటాడు. భార్య కనబడి నప్పుడు ఆమెకేవో సమాధానాలిస్తాడు.

ఎప్పటి మాదిరిగా ఆ రోజుకూడా అతడు రీడింగ్‌రూము కెళ్ళి తెలుగు పత్రికలు చదివాడు.

ఎవరో ఇద్దరు కిరసనాయిలు సీసాలతో తెచ్చి, గుడిసెలమీదపోసి ఒకరాత్రి వేళఅగ్గిపుల్ల గీసి పరుగెత్తుతుండగా, పొరుగూరినుంచి స్కూటర్ల మీద పోతున్న పోలీసులు వాళ్ళను తుపాకులతో కాల్చారనీ, వాళ్ళిద్దరూ కొంతదూరం పరుగెత్తి పడిపోయారన్న వార్త సాంబయ్య చదివాడు. ఆ వార్తల మొదట్లో ఊరిపేరు కూడా రాసి ఉంది.

సాంబయ్య పొలాలు చూసివస్తానని భార్యతోనూ, జాగ్రత్తగా చదువు కుంటూ ఉండండని పిల్లలతోనూ చెప్పి, బయలుదేరాడు. ఆయన వెళ్ళేసరికి మూడు రోజులు దాటాయి. శవాలను ఇన్నిరోజులు ఉంచరు కదా. అక్కడి పోలీసుస్టేషన్‌కి వెళ్ళి ఆ చనిపోయిన వాళ్ళెవరని అడిగాడు.

"ఈ మధ్య ఒక జట్టుఉన్న స్థావరంనుండి, మరొక స్థావరంలోకి మారింది. అప్పటినుంచీ ఇళ్ళు తగలబెట్టడాలు ఎక్కువైనాయి. నాలుగైదు రోజులనాడు ఒక స్త్రీ పురుషుడూ ఇళ్ళకునిప్పంటించి పరుగెత్తుతున్నారు. ఆ మంటలనూ, ఈ పరుగెత్తేవాళ్ళనుచూసి పోలీసులు తుపాకులు పేల్చారు. కొంతదూరం వెళ్ళిన

తరువాత ఆ ఇద్దరూ పడిపోయారు. ప్రాణాలు పోయాయనుకోండి. వాళ్ళనుచూసి మా దగ్గరున్న ఫోటోలుచూసి వీళ్లే వాళ్ళని గ్రహించి హెడ్డాఫీసుకు ఫోనుచేశాము. వీళ్ళకోసం ఎంతకాలంనుంచో వెతుకుతున్నాము. ఊళ్ళుతిరుగుతూ చాలా ఇబ్బందులు పెట్టారు. మొన్నటికి వాళ్ళపాపం పండిందనుకోండి" అన్నారు ఎస్సై.

ఆ ఫోటోలను నేనొకసారి చూడవచ్చా?" అడిగాడు సాంబయ్య.

"చూడండి ఎలాగూ చచ్చిపోయారుగా. చూడండి దానికేం? మీకుకూడా వాళ్ళవల్ల బాధలుకలిగాయా?" అంటూ ఫోటోలు చూపించాడు.

సాంబయ్యచూశాడు సరిగా కనబడలేదని కళ్ళు ఉత్తరీయంతో అద్దుకుని బాగాచూశాడు. నిర్ధారణచేసుకుని, కడుపులో పైకితన్నుకుంటూవస్తున్న దుఃఖాన్ని బయటపడనివ్వకుండా గబగబా బస్టాండుకువచ్చి ఒక చెట్టుకిందకూర్చుని ఆ పొంగు తగ్గేవరకూ ఏడ్చాడు.

"ఇందుకా మరకతం! నీ పిల్లలను మాదగ్గరికిచేర్చింది? నేనప్పుడే గ్రహించాను తల్లీ కాని-నీవు ఆపితే ఆగేటట్టులేవు. చెప్పకుండానే వెళ్ళావు."

అంతలో బస్సువచ్చింది.

బస్సులో కూర్చున్నంతసేపూ ముఖాన బట్టపెట్టుకుని కుమిలి కుమిలి ఏడ్చాడు. "నీ బదులు నీ బిడ్డలనిద్దరిని చూసుకొమ్మని ఇచ్చావా అమ్మా!"

అతడికి ఆ దుఃఖంలో ఒక సమస్య బయలుదేరింది. ఈ సంగతి ఇంట్లో చెప్పాలా వద్దా అని.

చెప్పితే పిల్లలు ఏడుస్తారు. చదువుకునే పిల్లలను ఏడిపించటమా? వాళ్ళు ఇంచుమించుగా తల్లి తండ్రులను మరిచిపోయినట్టుగానే వాళ్ళనుగురించి అడగటమే లేదు.

ఇక సుబ్బాయమ్మ-వాళ్ళను ఎప్పుడోచచ్చిన వాళ్ళల్లో జమకట్టింది.

కాని-తను?

కళ్ళతో ఫోటోలుచూశాడు. రాత్రిళ్ళువాళ్లే కళ్ళల్లోకనుపిస్తున్నారు. "నాన్నా ఈ పిల్లలిద్దరినీ నీదగ్గరుంచుకో. మళ్ళీ నేనేవచ్చి తీసుకువెళ్తానని చెప్పాను.

అమ్మతోకూడాచెప్పు నాన్నా. వాళ్ళుభారమని అనుకోకు. నేనుంటే అలా అనుకోవుగా. నాబదులు వాళ్ళున్నారనుకో" అన్నట్టుగాఉంది. ఆ మాటలు ఇంకా వినబడుతున్నట్టే ఉంటుంది ఇంత దుఃఖాన్ని మింగి పిల్లలతో నవ్వుతూ మాట్లాడగలనా? వాళ్ళను 'చదువుకోండర్రా' అని అనగలనా?

సుబ్బాయమ్మ రోజుకొకసారయినా అల్లుణ్ణి తిట్టిపోస్తుంది తన ఎదుట. ఈ పరిస్థితిలో ఆ మాటలు వినగలడా? ఎప్పుడైనా పొరబాటున నోరుజారి నిజం చెప్పేస్తానేమో?" అని ఆలోచిస్తాడు. ఆవేదన పడతాడు కుమిలిపోతాడు.

అందుకని ఇప్పుడతడు ఏమాటకూ అవునూకాదూ అని తల ఊపటం ప్రారంభించాడు. పిల్లలను చూసినప్పుడు 'బాగా చదువుకోండి' అంటాడు. కాని రాత్రిళ్ళు కంటితడి ఆరకుండా ఏడుస్తాడు. "ఎటువంటిచావు వచ్చిందమ్మా నీకు?" అని తల బాదుకుంటాడు.